


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**"కాల్ ఫ్రం** బోంబే సర్..." ఫోన్‌లో ఆపరేటర్ గొంతు పలికింది. ప్రతాపరెడ్డి ఫోన్ అందుకున్నాడు. క్షణం తరువాత అట్నుంచి ఒక బొంగురు గొంతు వ్యక్తి లైన్‌లోకి వచ్చాడు. "మిస్టర్ రెడ్డి. శ్రీకళ్యాణీ ఏజెన్సీ తాలూకు షిప్ మునక గురించి ఎంక్వయిరీ చేయమన్నారు కదూ."

"ఇన్స్యూరెన్స్ కట్టకపోవటం వెనక ఎవరి హస్తం ఉందో ఎంక్వయిరీ చేయమన్నాను."

"రెండింటికీ సమాధానం ఒకటే మిస్టర్ రెడ్డి..." అంటూ అట్నుంచి ఆ బొంగురు గొంతు వ్యక్తి చెప్పటం ప్రారంభించాడు.రెండు నిమిషాలు మాట్లాడి ప్రతాపరెడ్డి ఫోన్ పెట్టేశాడు. అతడి మొహం నల్లగా కమిలిపోయి ఉంది. అతడు వెంటనే సత్యానికి ఫోన్ చేశాడు. "నువ్వు రా. మనం వెంటనే వెళ్ళాలి."

"ఎక్కడికి?"

"చెపుతాను. రా" అని అతడు లేచి నిలబడ్డాడు. అద్దంలో ఒకసారి చూసుకుని బయటికి వచ్చి సత్యం కోసం ఎదురు చూడసాగాడు. అతడు చేతిలో కళ్యాణి కోసం కొన్న XIC–20 బాటిల్ ఉంది. అప్పుడు టైమ్ 7–45 అయింది. సత్యం రాగానే హోటల్ వైపు బయల్దేరారు ఇద్దరూ.

★ ★ ★

కార్తీక్, కళ్యాణి హోటల్‌కి వెళ్ళేసరికి రాత్రి ఎనిమిదయింది. ఒక మూల టేబిల్ దగ్గర కూర్చున్నారు. హాలంతా మంచి పరిమళం, సన్నగా వచ్చే మ్యూజిక్‌కి తోడై మనసుని ఆహ్లాదపరుస్తోంది. అప్పుడే విచ్చుకుంటూన్న గులాబిపువ్వు టేబిల్ మీద అందంగా, అమాయకంగా ఉంది.

"మీరు విస్కీ బ్రాందీ లాటివి తీసుకుంటారా?"

"లేదు లేదు" అన్నాడు కంగారుగా. ఆమె నవ్వు ఆపుకుని, "ఒకసారి అనొచ్చుగా, 'లేదు లేదు' అని రెండుసార్లెందుకు?..." అని స్టీవర్డ్ వైపు తిరిగి, "రెండు ప్లాంటర్స్ పంచ్" అంది. "దాంతో పాటే ఫ్రయిడ్ ప్రాన్స్ కూడా."

అతడు వెళ్ళాక కార్తికేయ అడిగాడు. "ప్లాంటర్స్ పంచ్ అంటే?"

''తాగి చూడండి. తెలుస్తుంది.''

''అది సర్లెండి గానీ, మీరిలా తీసుకురావడం నాకర్థం కావటం లేదు. ఆశ్చర్యంగా ఉంది.''

''చెప్పాగా. ఎలాగూ మునిగిపోతున్నామని తెలిసినప్పుడు, కడుపునిండా నీళ్ళు త్రాగి చావటం మంచిది. ఐ.పి. పిటిషన్ పెట్టేముందు చాలామంది సగం ఆస్తిని దాచేస్తారు.''

''నాకు అర్థం కానిది – మీరెందుకు వచ్చారని కాదు. నన్నెందుకు తీసుకొచ్చారని?''

''మీకూ నాకూ తేడా ఏముంది? ప్రస్తుతం ఇద్దరూ ఒకే స్థాయిలో ఉన్నాం. ఆ మాటకొస్తే ఇప్పుడు నేను 'పే' చేయబోయే బిల్ కూడా మీ డబ్బే. ఇక అసలు విషయానికొస్తే, ఇప్పుడు నేను మిమ్మల్ని ఇక్కడికి తీసుకొచ్చింది దేనికంటే, దివాళా అప్లికేషన్ పెట్టటానికి నెల రోజులు టైమ్ ఉంది. ఈ నెల రోజుల్లో ఒక పది ఇరవై లక్షలు తీసి దాయమంటారా? ఈ గొడవలు పూర్తయాక మనకి పనికి వస్తుంది''.

''నేను జైలు నుంచి తిరిగి వచ్చాకా?''

''ఛా ఛా, నా ఉద్దేశ్యం అదికాదు.''

''నా సంగతికేంగానీ, మీరేం చేస్తారు? అది చెప్పండి.''

''ప్రతిరోజూ రెండు పూటలా జైలుకి క్యారియర్ తెస్తాను'' అనేసి, వెంటనే, అతని మనసు నొప్పించే జోకు వేశానా అన్నట్టు చూసింది. అతడు దాన్ని పట్టించుకోలేదు. ఆమెకెందుకో ఆ సాయంత్రం చాలా సంతోషంగానూ, మనసు గాల్లో ఎగిరిపోతున్నట్టుగానూ ఉంది. అతనన్నాడు – ''ఇన్ని కోట్లతో వ్యాపారానికి అలవాటు పడ్డారు. రేపట్నుంచి ఏం చేస్తారు? ఎలా తోస్తుంది?''

వెయిటర్ గ్లాసులు, ప్లేట్లు తీసుకొచ్చి పెట్టాడు. ఆమె గ్లాస్ ఎత్తి 'ఛీర్స్' అని గుటకవేసి, 'ఎలా ఉంది' అని అడిగింది.

''బావుంది'' అన్నాడు. ఆమె ప్రాన్స్ ప్లేటు దగ్గరకి లాగింది. హాల్లో పాట పూర్తి కావొచ్చింది. చివర్లో గిటారిస్టు తీగె మీద అపశృతి కొట్టటంతో ఒక కృతవాకపు వికృత శబ్దం లాటిది గదిలోకి వ్యాపించింది. పాట పూర్తయి ఆగింది. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ''నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు మీరు'' అడిగాడు.

''నాకు తెలిసినవాళ్ళు చాలామంది ఉన్నారు. ఎవరైనా కళ్ళకద్దుకుని భాగస్వామ్యం ఇస్తారు. చిన్న లెవల్లో మొదలు పెట్టి వ్యాపారాన్ని పెంచుతాను. మీరు తిరిగొచ్చేసరికి మళ్ళీ మామూలు పొజిషన్‌లోకి వచ్చేస్తాన్లెండి''.

అతడు నవ్వాడు. ఆమె ఉక్రోషంగా ''నేను మాటిమాటికీ జైలు గురించి ఇన్నిసార్లు అన్నా, మీరు కోపం తెచ్చుకోరేం?'' అంది.

''తెచ్చుకొని ఏం చెయ్యను? అలా అనొద్దండీ అననా? అలా అంటే మరీ రెచ్చిపోతారు.''

‘‘అవును? నేనెందుకు ఎప్పుడూ నెగెటివ్‌గా మాట్లాడతాను?’’ బల్లమీద మోచేతులు పెట్టి అరచేతుల మధ్య గెడ్డాన్ని దాచుకుంటూ అడిగింది. అతడు తెల్లబోయి ‘‘నాకేం తెలుసు’’ అన్నాడు.

‘‘ఆ రోజు ఫోన్‌లో చెప్పారుగా. అలాగే చెప్పండి.’’

అతడు కళ్ళు దించి ఆలోచించసాగాడు. ప్లేట్‌లో రొయ్యలు నీటి అడుగు సుడిగుండాల్లా ఉన్నాయి. కొన్ని చిన్న ప్లేట్‌లోకి మార్చి అతడి ముందుకు తోసి తనూ ఒకటి తీసుకుని ఫోర్క్ గుచ్చింది. అంతలో అతడు మాట్లాడటం ప్రారంభించటంతో మళ్ళీ దాన్ని ప్లేట్‌లోనే వదిలేసింది. వెంటాడే దురదృష్టం తాత్కాలికంగా దూరమయినట్టు ప్రాన్ మళ్ళీ ప్లేట్ లోకి జారింది.

ఈ లోపులో అతనన్నాడు. ‘‘చాలా సంభాషణలు గమనించండి. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకునేటప్పుడు అక్కడలేని మూడో వ్యక్తి గురించి చెడుగా గానీ, హేళనగా గానీ మాట్లాడుకుంటారు. ఎందుకు? తాము మంచివాళ్ళం అని ఇన్ డైరెక్ట్‌గా పరస్పరం చెప్పుకోవటం కోసం. తమలోని అభద్రతా భావాన్ని పోగొట్టుకోవటం కోసం. అవునా?’’

అతని సునిశిత దృష్టికి ఆశ్చర్యపోతూ ఆమె తలూపింది. ఒక సిప్ తాగి కింద పెట్టి, ప్రాన్స్ తిరిగి తీసుకోబోతోంటే కరెంట్ పోయింది. ‘మైగాడ్’ అంది ఆమె ప్రాన్ వదిలేస్తూ. మనిషి సంతోష విషాదాల్లా గోడల మీద వెలుగునీడలు పారాడుతున్నాయి. అతడు కొనసాగించాడు. ‘‘మనిషి తాను ఎలా బ్రతకాలనుకున్నాడో దాన్ని సపోర్టు చేస్తాడే తప్ప, తనెలా బ్రతుకుతున్నాడో దాన్ని సపోర్టు చేయడు. రెండు పక్క పక్క ఇళ్ళల్లో రెండు కుటుంబాలున్నాయనుకోండి. అందులో ఒక మగవాడికి రహస్యంగా రెండో భార్య ఉన్నదన్న వార్త బయటికొస్తే, పక్క వాటాలో మగవాడు తన భార్య దగ్గర అతడిని తిడతాడు. ఇతడికి కూడా ఇంకో రెండో భార్య ఉన్నాసరే.’’

ఆమె గట్టిగా నవ్వింది. ఆమె అంత గట్టిగా నవ్వటం చాలా అరుదు. ‘‘బోరు కొడుతున్నానా?’’ అన్నాడు.

‘‘లేదు. లేదు. చెప్పండి’’ ఉత్సాహంగా అంది. ఆమె మనసులో ఒక భావం క్రమక్రమంగా రూపు దాల్చుకుంటోంది. బయట జనరేటర్ ఆన్ చేసినట్టున్నారు. చల్లటిగాలి వస్తోంది. మనిషి అదృష్ట దురదృష్టాల్ని పరీక్షించే జూదపు గవ్వల్లా ప్లేట్‌లో ప్రాన్స్ అలాగే ఉన్నాయి.

‘‘పైన నేను చెప్పిన రెండు ఉదాహరణలూ తమ మీద తమకి నమ్మకంలేని మనుష్యుల గురించి. ఎప్పుడయితే తన మీద తనకి నమ్మకం కుదురుతుందో, మనిషి తన సిద్ధాంతాల్ని బయటకు వెల్లడి చేయటం ప్రారంభిస్తాడు. ఇది సమాజానికి నచ్చదు. అతడిని నెగెటివ్‌గా చిత్రీకరిస్తుంది. ఆ మనిషి కూడా దాన్ని ఒక క్వాలిఫికేషన్‌గా తీసుకుంటాడు. ప్రస్తుతం మీరు ఆ స్థితిలోనే ఉన్నారని నా ఉద్దేశ్యం... కాస్త ఓవర్ డోస్‌లో. ఈ విధమైన నెగెటివ్‌నెస్ బహిర్గతం చేసేవారు అవతలివాళ్ళకి ఓ పట్టాన అర్థం కారు.’’

*‘ఎందుక్కారు? మీరు అర్థం చేసుకుంటారు.. కార్తికేయ చేసుకోకపోతే ఇంకెవరూ చేసుకోరు.’*

ఆమె మనసు క్లియర్ అయింది. తను చెప్పదల్చుకున్న సమయం ఆసన్నమైంది. ఆస్తి పోయిందనే తన అబద్ధపు నాటకం గురించీ... అతనితో పెళ్ళి విషయంలో చెప్పిన అబద్ధం గురించి చెప్పేయాలి అనుకుంటూ ఆమె ఫోర్క్‌తో ప్రాన్ నోటి దగ్గరకు తీసుకుంది. దాని మీద మసాలా– జీవితం మీద మృత్యువు జల్లిన నల్లని మరకలా ఉంది. ''ఇప్పుడు నేను మిమ్మల్ని ఈ హోటల్‌కి తీసుకొచ్చిన అసలు కారణం చెపుతాను. నా ఆస్తి... అదే– ఐమీన్...'' ఆగి ప్రాన్ నోట్లో పెట్టుకుంది. అంతే. ఆమెకు పొలమారింది. గుటక వేసి మంచినీళ్ళు తాగింది. అయినా దగ్గు తగ్గలేదు. కార్తికేయ నాప్‌కిన్ అందించాడు.

కళ్ళు తిరుగుతున్నట్టు అనిపించింది. బల్ల అంచు పట్టుకోవాలని ప్రయత్నించింది అందలేదు. ముందుకు తూలింది. కార్తికేయ కంగారుగా 'కళ్యాణీ...' అంటున్నాడు. అది మాత్రం తెలుస్తోంది. తనవైపు పరుగెత్తుకు వస్తూన్న హోటల్ సిబ్బంది, లేచి నిలబడుతూన్న కస్టమర్లు మసగ్గా కనబడుతున్నారు. నాలుకను రెండు వేళ్ళతోనూ పట్టుకుని ముందుకు లాగుతున్నట్టు... నరాల్ని మెలిపెడుతున్నట్టు... శరీరాన్ని పెనంలో వేసి వేపుతున్నట్టు... ఆమె కనుగుడ్లు రెప్పలపైకి వెళ్ళాయి. గొంతులో శబ్దం దిగంతాలకు పాకి నిశ్శబ్దంలోనే ముగిసిపోయింది. క్షణంలో ఆమెకు స్పృహ తప్పింది.

## 4

''**ఐయామ్** సారీ మిస్టర్ సత్యం. విషాహారం తినటంవల్ల ఆమెకి వాతం వచ్చింది. ఆమె తిన్న రొయ్యలు విషపూరితమైనవి.''

''ఎప్పటికి తగ్గగలదంటారు డాక్టర్?''

''చెప్పలేం. సంవత్సరం పట్టవచ్చు. లేక పది సంవత్సరాలు పట్టవచ్చు. జీవితాంతం బాగు పడకపోవచ్చు. నరాల సిస్టమ్ పూర్తిగా దెబ్బతిన్నది. మాట పడిపోకుండా ఉండటం అదృష్టం.''

''కేవలం విషాహారం తినటం వల్ల కాళ్ళూ చేతులూ పడిపోయే అవకాశం ఉందా?''

''చాలా 'రేర్' కేసు ఇది. ఆ రొయ్యలమీద లాబ్ రిపోర్టు కూడా వచ్చింది. అందులో విషం కెమికల్ పరీక్షలకి కూడా దొరకటం లేదు. సముద్రంలో ఏ భాగంలో పట్టుకున్నారో గాని ఆ రొయ్యలు చాలా అపాయకరమైనవి.''

మొహంలో భావం కనబడకుండా ''ఎంత ఖర్చయినా ఫర్వాలేదు డాక్టర్. మా కళ్యాణి బాగుపడాలి'' అన్నాడు సత్యం.

ఇక్కడ ఈ సంభాషణ జరుగుతున్న సమయానికి లోపల శ్రీకళ్యాణి మంచం మీద నుంచి కిటికీ గుండా బయటకు చూస్తోంది. ఆమె మొహం రక్తం లేనట్టు తెల్లగా పాలిపోయి ఉంది. కార్తికేయ ఆమెని అనునయిస్తున్నట్టు ''బాధపడకండి'' అన్నాడు. అన్నాడే గాని, ఆమె మానసిక ఉద్విగ్నత అతను ఊహించగలడు. చలాకీగా తిరుగుతూ కింద వాళ్ళతో పనులు చేయించుకుంటూ, కోట్లతో వ్యాపారాన్ని నిర్వహించే అమ్మాయి ఒక్కసారిగా ఇలా పడకని ఆశ్రయించవలసి రావటమంటే అది ఎంత షాకో అతడు ఊహించగలడు. ముందుకు వంగి, ''ఈ సమయంలో ఏం చెప్పినా అది ఓదార్పుగానూ,

వైరాగ్యంగాను తోచవచ్చు. నేను చెప్పగలిగేది ఒక్కటే కళ్యాణీ. జీవితంలో ఎత్తుపల్లాలు అనేవి సామాన్యం. కష్టం వచ్చినప్పుడే మనం మరింత ధైర్యంగా ఉండాలి. ఇదంతా మీకు తెలియనిది కాదు.''

ఆమె నెమ్మదిగా తలెత్తి చూసింది. ''నిజమే. ఎత్తుపల్లాలు తప్పవు. కానీ ఇది నేను అధిగమించలేనంత ఎత్తు. ఊహించలేనంత పల్లం''.

''అలా అనుకోవటం ఎందుకు? మెడిసిన్ చాలా అభివృద్ధి చెందింది. తొందర్లోనే బాగుపడే అవకాశం ఉంది కూడా.''

''నేను డాక్టర్‌తో మాట్లాడాను. నాతో అబద్ధం చెప్పే ధైర్యం డాక్టర్‌కి లేదు'' క్లుప్తంగా అంది.

అతడికేం చెప్పాలో తోచలేదు. నిశ్శబ్దం కూడా భయపెట్టగలదని మాత్రం అర్థమైంది. తోటకూర కాడల్లా వేలాడుతున్న తన చేతుల వైపు చూసుకుంటూ ''తీరిక సమయాల్లో ఏం చెయ్యాలా అని నేను మొన్న మొన్నటి వరకూ చాలా విసుక్కునేదాన్ని. ఇప్పుడు నాకు భలే టైమ్ పాస్...'' అంది.

అతడు ఆమెవైపు బ్లాంక్‌గా చూశాడు. తన అచేతనామయమైన శరీరాన్ని తనే ఒక ప్రేక్షకురాలిగా చూసుకుంటూ ''కాలి బొటనవేలు, చేతి చిటికెనవేలు కదపగలనా అని నాలో నేనే పందెం వేసుకుంటూ గంటలు, రోజులు, సం...వ...త్స... రా...లు గడపొచ్చు'' అన్నది..

అతడు వణికిపోయాడు. ఒక చిన్న వాక్యంలో తన భవిష్యత్ జీవితాన్ని ఇమిడ్చి ఆమె చెప్పిన ఆ రెండు వాక్యాలూ అతడిలోని ఫిలాంత్రఫిస్ట్‌ని నిద్రలేపాయి. గుండె నెండగొట్టుకుంటూ–అనుభూతి శూన్యత్వంతో– ఆర్ద్రతా రాహిత్యంగా– బ్రతుకేల– బ్రతుకనేల?

సందిగ్ధం మంచులా కరిగి, మానవత్వం పువ్వులా విచ్చుకున్న వేళ అతడు లేచి ఆమె దగ్గరగా వంగాడు. అనురాగంతో నుదుటిమీద, ఆప్యాయతతో అధరంమీద, అభిమానంతో చెక్కిలిమీద, ఆర్తితో కళ్ళమీద, ఆత్మీయతతో నాసికమీద, జాలితో పాపిడిమీద, ప్రేమతో కనుబొమ్మల మీద ముద్దు పెట్టుకుని, ''నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను కళ్యాణీ'' అన్నాడు.

ఆ అనూహ్య దిగంతాహ్వాన ప్రేమమయ రవళికి ఆమె విభ్రమురాలయింది.

చెట్టునుంచి జారే ప్రతి శిథిల పత్రమూ వ్యధకాదు, జరిగిపోయిన కథ కాదు. కొత్త చిగురుకి చోటిచ్చే ప్రయత్నం. నీ స్నేహం జాబిల్లిగా విరిసి – నీతోడు వెన్నెలగా కురిసి – దరిసి నీ ప్రేమ నిండు గోదారిగా ఎగసి – ఆ ఉప్పెనలో ఆనందంగా కొట్టుకుపోతాను.

అంతు తెలియని యాత్రలో, మలుపులో ఏముందో అన్న అనుమానం ఆమెని సంశయ పరుస్తుండగా ''... కానీ'' అంది.

అతడు దాన్ని వేరే విధంగా అర్థం చేసుకున్నాడు. ''డబ్బు లేదనీ, దేనికీ కొరగానిదాన్ననీ... అదేగా నీ అనుమానం? నువ్వు నాకు అలాగే కావాలి కళ్యాణీ. నీ ఆస్తితోగానీ, నీ డబ్బుతో గానీ నాకు సంబంధం లేదు. 'నన్ను పెళ్ళి చేసుకుంటావా' అని నువ్వడిగిన రోజు నేనందుకే భయపడి వెళ్ళిపోయాను. నేను నిన్ను కష్టపడి పోషించుకుంటాను. ఉన్నంతలో పెద్ద డాక్టర్లకే చూపిద్దాం. అదృష్టం ఏదో ఒకరోజు మన తలుపు తట్టకపోదు. ఆస్తి పోయిందనీ, శరీరం స్వాధీనంలో లేదనీ కృంగిపోకు. నీకు నేనున్నానని నమ్ము...''

ఆమె నీటి కళ్ళతో అతడివైపు చూసింది. నరాలు చచ్చుబడి మనిషి జీవచ్ఛవం అవుతున్నప్పుడు రాలేదు. డాక్టర్ 'నువ్వు ఇప్పట్లో బాగుపడవు' అన్నప్పుడు రాలేదు. ఇప్పుడొచ్చాయి కన్నీళ్ళు. వెన్నెల మాట్లాడినట్లు, సెలయేరు పెదవి విప్పినట్టు, పుప్పొడి పలకరించినట్లు, మలయమారుతం మంద్రధ్వని చేసినట్టు, మహనీయుడు మంత్రపుష్పం చదివినట్టు ఆ మాటలకి ఆమెకి కన్నీళ్ళు వచ్చాయి.

''అయ్యో, ఆస్తి ఎక్కడికీ పోలేదు...'' అంది ఏడుస్తూ. ''నేను మిమ్మల్ని సరదాగా పరీక్షించాలనుకున్నాను. దేవుడు నన్ను నిజంగానే పరీక్షించాడు.''

అతడు తెల్లబోయాడు. కొంచెం సేపటికి అర్థం అయింది. అంటే... అంటే... శ్రీకళ్యాణి 'సిరి' కళ్యాణే.

''మీరు నా ఆస్తంతా కొనుక్కొన్నరోజు మీమీద సరదాగా ఎలా దెబ్బతీయాలా అని ఆలోచించాను. ఒక ఆలోచన వచ్చింది. బోంబే ఫోన్ చేసి షిప్ మునిగి పోయిందన్న వార్త పంపమన్నాను. అర్ధరాత్రి మీ దగ్గరకు వచ్చి 'పెళ్ళి చేసుకుంటారా' అని అడిగాను. మీరు జవాబు చెప్పలేదు. నేనడిగిన వెంటనే పెళ్ళికి ఒప్పుకుంటారనుకున్నాను. ఒప్పుకున్న మరుసటిరోజు నేను బికారినయ్యానన్న వార్త తెలిసి పెళ్ళికి వెనుకాడతారనీ, అప్పుడు నేను మిమ్మల్ని గెలిచినట్టు అవుతుందనీ అనుకున్నాను. కానీ మీరు ఆస్తి నాకు తిరగ వ్రాసి వెళ్ళిపోయారు. అంతలో సత్యం ఇంకో విషయం చెప్పాడు. అప్పుల వాళ్ళు కోర్టుకి వెళితే జైలు పాలవాల్సి వస్తుందని. అప్పుడయినా మీరు 'నాకూ ఈ అప్పులకీ సంబంధం లేదంటారేమో' అనుకున్నాను. ఎప్పటికప్పుడు... 'చూశావా విషయం తన వరకూ వస్తే మనిషి ఎలా మాట తప్పుతాడో... ఈ ప్రపంచంలో డబ్బుకున్న విలువ దేనికీ లేదు' అని మిమ్మల్ని ఒప్పించటం కోసం ఇన్ని రకాలుగా నాటకాలు ఆడాను. చివరికి దేవుడు నన్ను ఓ కదిలే శవాన్ని చేసి ఇంకెప్పుడూ నాటకాలాడకుండా కట్టడి చేశాడు. ఒకప్పుడు నామీద నాకున్న ధీమాకి 'నన్నూ, నా ఆస్తిని స్వీకరించు' అందామనుకున్నాను. అంత ధీమాతో మళ్ళీ తలెత్తకుండా మెడలో నరాలు విరగ్గొట్టాడు . ఇప్పుడిక మీతో సేవ చేయించుకుంటూ అనుక్షణం నాలో నేనే...''

'ఇక ఆపు' అన్నట్టు అతడి చెయ్యి ఆమె నోటి మీద పడింది. ''ఒక షరతుమీదే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను'' అన్నాడు. ఈ ఆకస్మిక పరిణామానికి ఆమె నిరత్తురాలైంది. ''ఇక ముందెన్నడూ నీవు నీ 'లేనితనం' గురించి బాధపడ కూడదు. పూర్వపు కళ్యాణిలాగే పొగరుగా, అల్లరిగా ఉండాలి. మన పెళ్ళికి అదీ షరతు.''

ఆమె కన్నీళ్ళతో నవ్వింది. విషాదానికి, సంతోషానికీ కలిపికట్టిన వారధిలా ఉన్నదా నవ్వు. ఎద నిండిన ఆనందం గుండె పాత్ర పొర్లి, కంటి చివర నీటి చుక్క చెంప మీదకు జారటం అంటే ఏమిటో అప్పుడర్థమైందామెకు.

**సంధ్య తలుపు వెనుక**

**మృత్యువలా ఉండనీ – పొంచుండనీ,**

**నన్ను మాత్రం – ఆశ నిండిన కళ్ళతో**

**నీ దివ్యరూపం ముందుండనీ – చూస్తుండనీ.**

–o–

## అధ్యాయం – 3

**సత్యం** బలంగా విసిరిన గ్లాసు తగిలి అద్దం భళ్ళున బ్రద్దలైంది. సత్యం మనిషిలా లేదు. రాక్షసుడిలా ఉన్నాడు. సత్యాన్ని ఆ పొజిషన్‌లో చూడటం ప్రతాపరెడ్డికి అదే ప్రథమం. మనుష్యులు పైకి చాలా సాఫ్ట్‌గా ఉండి, డ్రింక్ చేసినప్పుడు వికృత రూపంలోకి మారతారు. మామూలు సమయాల్లో తన లోపలి మనిషిని బలవంతంగా నొక్కిపెట్టి ఉంచటం వల్ల, ఇటువంటి పరిస్థితుల్లో ఆ రాక్షసుడు బయటకొచ్చి విజృంభిస్తూ ఉంటాడు.

''ఆ రొయ్యలేగానీ ముందు కార్తికేయ తిని ఉంటే...'' అన్నాడు అశ్వత్థామ. ఆ మాటలకి సత్యం విసుగ్గా లేచి, ''ఉంటే ఏమిటి – ' ఉంటే' లేదు 'గింటే' లేదు. కార్తికేయ తిని ఉంటే కళ్యాణి అతన్ని డ్రైవర్‌తో హాస్పిటల్‌కి పంపి ఉండేది. సరేనా!'' అని అరిచాడు.

''సత్యం నువ్వు ఆవేశపడకు. కూర్చో. ఇప్పుడు మన సమస్య మరింత కష్టం అయింది. ఆ సంగతి ఆలోచించకుండా మనం అనవసరంగా కొట్టుకుంటున్నాం.''

''ఏం కష్టమయింది?''

''శ్రీకళ్యాణి మర్డర్ మామూలుగా జరిగితే వెంటనే సత్యం మీదికి అనుమానం వస్తుందని కదా ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం? వాళ్ళ పెళ్ళి కూడా నిన్న సాయంత్రం అయిపోయింది కాబట్టి కళ్యాణి ఛస్తే ఆస్తంతా కార్తికేయకి వెళ్తుంది. కార్తికేయ ఛస్తే అతనికి వారసులు లేరు కాబట్టి సత్యానికి వస్తుంది. కానీ దాంతో సి.బి.ఐ. వాళ్ళ అనుమానం కూడా వెంటనే సత్యం మీదకు వస్తుంది.''

''మీకు చాలా దూరదృష్టి ఉందే'' అన్నాడు ఆశ్వత్థామ. ప్రతాపరెడ్డి ఆ మాటలు పట్టించుకోకుండా ''ఇప్పుడు మన పని రెట్టింపయింది. కేవలం కళ్యాణినే కాదు, కార్తికేయని కూడా చంపాలి.'' అన్నాడు.

''అయితే ఇద్దర్నీ ఒకే ఆక్సిడెంట్‌లో చంపాలి. అనుమానం రాకుండా అలాచేస్తే ఫర్వాలేదు. కాని ఇద్దరూ కలిసి బయటకు వెళ్ళరు. శ్రీకళ్యాణి నడిచే స్థితిలో లేదు. కనీసం చెయ్యి కదిపే స్థితిలో కూడా లేదు. ''

''అలాటిది పెళ్ళి ఎలా చేసుకుంది? మెళ్ళో దండ ఎలా వేసింది?'' అశ్వత్థామ ఆసక్తిగా అడిగాడు.

''రిజిష్టర్ మ్యారేజి'' అన్నాడు రెడ్డి.

''సంతకమన్నా పెట్టాలి కదా''.

''కార్తికేయ ఆమె చెయ్యి పట్టుకుని రిజిష్టర్‌లో వేలి ముద్ర వేయించాడు. సరేనా'' విసుగ్గా అన్నాడు సత్యం. ''...మీరు ఆలోచించవలసింది మన పని మనం ఎలా పూర్తిచేయాలా అని. అంతేగానీ తన పని అతనెలా చేసాడా అని కాదు.''

''నాకొక ఆలోచన వస్తోంది'' ప్రతాపరెడ్డి సాలోచనగా అన్నాడు.

ఇద్దరూ ముందుకు వంగి, ఉత్సుకతతో ''... ఏమిటది?'' అన్నారు.

''కార్తికేయ తండ్రి జమిందారు. ఆస్తంతా ఉంచుకున్న దానికోసం తగలెట్టాడు. అలా మన వ్యక్తిని అతడి మీదకు ప్రయోగిస్తే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను.''

సత్యం లేచి, ''ఏడ్చినట్టు ఉంటుంది. అన్నీ పాతకాలం విప్రనారాయణ లాటి ఆలోచన్లు. నే వెళ్తున్నాను. నాకు చాలా ఇరిటేటింగ్‌గా ఉంది. అసలు ఏడాది క్రితమే దాని కారు బ్రేకులు తీసేస్తే ఆక్సిడెంట్ అయి చచ్చి ఉండేది. ఇప్పుడీ పెళ్ళి, ఇంకెవడో ఆస్తికి వారసుడవటం, ఛీ... ఛీ... తల్చుకుంటేనే గాడిదతో తన్నించుకున్నట్టు ఉంది. నే వెళ్తున్నా'' అని పెద్దగా అడుగుల చప్పుడు చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

సరీగ్గా గంట తర్వాత అశ్వత్థామ నాలుగో పెగ్‌లో తూలుతూ ఉండగా ''అసలు నీకూ సత్యానికీ ఎలా పరిచయం?'' అడిగాడు రెడ్డి.

''అతడొక సైకో పేషెంట్. అప్పుడు పరిచయం.''

రెడ్డి ఆసక్తిగా ముందుకు వంగి ''సమస్య?'' అన్నాడు.

''హెలూసినేషన్స్. దెయ్యాలూ, భూతాలూ కలలోకి వస్తుంటాయి. ఒకమ్మాయి తనని చంపేస్తున్నట్టు తరచు భయపడుతూంటాడు. శీఘ్రస్కలనం కూడా ఉంది. దాంతో విపరీతమైన ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్. దాన్ని కప్పిపుచ్చుకోవటానికి సూడో సుపీరియారిటీ చూపిస్తూ ఉంటాడు. ఈ ఆత్మన్యూనతా భావంవల్లే సంవత్సరం క్రితం అతడొక హత్య చేశాడు.''

రెడ్డి చప్పున ''ఎవర్ని?'' అని అడిగాడు.

''అతని గర్ల్‌ఫ్రెండ్‌ని. ఆ అమ్మాయి అతనితో బాగా స్నేహంగా ఉండేది. రెండు మూడు సంవత్సరాల తరువాత ఆమెకి పెళ్ళయింది.''

''పేరు?''

''మనోజ్ఞ'' అన్నాడు అశ్వత్థామ. ''ఇదంతా హిప్నాటిక్ ట్రాన్స్‌లో నాకు చెప్పాడు.''

“హత్య ఎందుకు చేశాడు?”

“పెళ్ళయిన తరువాత ఆ అమ్మాయి ఇతని దగ్గరకు రావటం మానేసింది. అప్పటివరకూ సెక్స్ అంటే ఆమెకు తెలిసింది రెండు నిముషాలే. అదే ఆనందం అనుకుంది. పెళ్ళయిన తరువాత ఆవిడ లైఫ్‌లో రెండో మగాడు– అంటే భర్త, నిజమైన సెక్స్ అంటే ఏమిటో చూపించాడు. దాంతో ఇతడి వైపు కన్నెత్తి చూడటం కూడా మానేసింది.”

“దాని కోసం హత్య చేయవలసిన పని లేదే.”

“ఇతడో సైకిక్. ఇలాటి వాళ్ళు ఎంతకయినా తెగిస్తారు. పెళ్ళయిన తరువాత కూడా ఆ అమ్మాయి తన ఆధీనంలో ఉండాలనీ, అన్నీ తనకు చెప్పుకుని తన నుంచి సానుభూతి పొందాలనీ ఆశించాడు. ఆ అమ్మాయి కాస్త అల్లరిపిల్ల. ఇతను రమ్మని అడిగితే, ఓ ఉత్తరం వ్రాసింది. ఆ ఉత్తరం చదివి విపరీతంగా ఇరిటేట్ అయి వెళ్ళి మర్డర్ చేశాడు. “

“ఏం వ్రాసింది ఆ ఉత్తరంలో?”

“దీర్ఘస్కలనము – అన్న ఇంపోజిషన్ లక్షసార్లు వ్రాసి చూపించు వస్తాను– అని వ్రాసింది” అశ్వత్థామ పడిపడి నవ్వుతూ చెప్పాడు. ప్రతాపరెడ్డి మాట్లాడలేదు. అర్థం చేసుకోగలడు. ‘కాంప్లెక్స్’ మనిషిని దేనికైనా తెగించేలా చేస్తుంది. దానికి తర్కం లేదు.

“గురూగారూ– ఇంకెంత కాలంలో వాళ్ళిద్దరూ ఛస్తారు? మనం ఈ విస్కీలోంచి స్కాచ్‌లోకి ఎప్పుడు దిగుతాం?” మరో పెగ్ గ్లాసులోకి వంపుకుంటూ అశ్వత్థామ అడిగాడు.

“అదంత సులభం కాదు. ఏదో ప్లాన్ చేయాలి. ఎవరూ ఊహించని ప్లాన్.”

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments